సాక్షి
పెద్దపల్లి
శుక్రవారం । 3 । నవంబర్ । 2023

రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో పోలీస్‌బాస్

గోదావరిఖని(రామగుండం): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో పర్యటించారు. గోదావరినదిపై పడవలో వెళ్లారు. అంతరాష్ట్ర చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. పెర్రీపాయింట్స్ సందర్శించి మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. సీపీ వెంట మంచిర్యాల డీసీపీ సుధీర్‌కేకన్, జైపూర్ ఏసీపీ మోహన్, చెన్నూరు సీఐ వాసుదేవరావు తదితరులున్నారు.



న్యూస్‌రీల్

ఫిర్యాదులపై సత్వరం స్పందిస్తున్నాం

పెద్దపల్లిరూరల్: ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై అందుతున్న ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. సీ విజిల్ యాప్ ద్వారా ఇప్పటివరకు 53, 1950 టోల్‌ఫ్రీ నంబరు ద్వారా 1,142 ఫిర్యాదులందాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు నిర్వహించిన తనిఖీల్లో రూ.కోటి 16 వేల 860 జప్తు చేసి పూర్తిస్థాయి ఆధారాలు చూపడంతో తిరిగి విడుదల చేశామన్నారు. రూ.35,54,664 విలువ చేసే వస్తువులను జప్తు చేసి రూ.34,04,664 సామగ్రి విడుదల చేశామన్నారు. రూ.లక్షా50వేలు విలువ చేసే 30 డీజే బాక్సులకు ఆధారాలు చూపనందున విడుదల చేయలేదని వివరించారు.

నిబంధనల మేరకు విధులు నిర్వహించాలి



సమావేశంలో ఎన్నికల అధికారులు

జ్యోతినగర్(రామగుండం): అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని సహాయ వ్యయ పరిశీలకుడు అశోక్‌కుమార్, నోడల్ అధికారి తిరుపతి సూచించారు. గురువారం ఎన్టీపీసీ రామగుండం టీటీఎస్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీం, వీడియో, వీడియో వ్యూయింగ్ బృందాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వాహనాల తనిఖీ, నగదు, మద్యం, ఇతర విలువైన వస్తువుల జప్తునకు సంబంధించిన సూచనలు, ఎన్నికల అభ్యర్థులకు సంబంధించిన ఖర్చును ఏ విధంగా లెక్కించాలో పలు సూచనలు చేశారు. సమావేశంలో సహాయ ఖర్చు పరిశీలకులు, నోడల్ అధికారి, ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించిన అధికారులు, ఎన్నికల నిర్వహణ బృందాల సభ్యులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశం కల్పించాలి

జ్యోతినగర్(రామగుండం): అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించేలా చూడాలని రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ, అధికారులను ఆదేశించారు. గురువారం ఎన్టీపీసీ రామగుండం టీటీఎస్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎంపీడీవో, ఎంపీవోఎస్, సీడీపీవోలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే అన్ని ఎన్నికల కేంద్రాలను తనిఖీ చేసి, ఏర్పాట్లను మరోసారి పరిశీలించాలని సూచించారు. మహిళా పోలింగ్ అధికారులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశం ప్రకారం స్వీప్ అవగాహన కార్యక్రమాన్ని వేగవంతం చేసి ప్రజలు ఎక్కువ మొత్తంగా ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని రిటర్నింగ్ అధికారి దిశా నిర్దేశం చేశాయి.

లావాదేవీల సమాచారమివ్వండి

మంథని: మంథనిలో ఆయా బ్యాంకుల అధికారులతో ఆర్డీఓ హనుమనాయక్ గురువారం సమావేశమయ్యారు. ఖాతాదారులకు సంబంధించి రూ.10లక్షలకు మించి లావాదేవీలు జరిగితే తమకు సమాచారం ఇవ్వాలని బ్యాంకు అధికారులకు సూచించారు. పెద్ద మొత్తంలో నగదు బదిలీల వివరాలు తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆయా బ్యాంకుల మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు



అవగాహన కల్పిస్తున్న డీఏవో ఆదిరెడ్డి

ముత్తారం(మంథని): మండలంలోని ఓడెడ్‌లో గురువారం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి హాజరై మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగుతో రైతులు లాభాలు పొందుతారని పేర్కొన్నారు. ఇసుక మేటలు వేసిన భూముల్లో ఆయిల్‌పామ్ సాగుతో పెట్టుబడి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చిందం శ్రీకాంత్, సర్పంచ్ సిరికొండ బక్కారావు, ఎంపీటీసీ పోతిపెద్ది కిషన్‌రెడ్డి, ఉద్యానవనశాఖ అధికారి శ్రీకాంత్, ఏఈవో శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.



ఎవరైతే ధర్మాన్ని సరిగా నిర్వర్తిస్తారో.. వారే దేశాన్ని ఉద్ధరించగలరు.
- డాక్టర్ బీఆర్. అంబేడ్కర్

మీకు తెలుసా..?

కాంగ్రెస్‌కు కాడెడ్లు.. కమ్యూనిస్టులకు 'హస్తం'

కరీంనగర్: హస్తం గుర్తును మొదటి సార్వత్రిక ఎన్నికల్లో కమ్యూనిస్టులకు కేటాయించారు. 1952లో కాంగ్రెస్ పార్టీది కాడెడ్ల గుర్తు కాగా, అప్పట్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆ గుర్తుపైనే పోటీ చేసింది. హైదరాబాద్ సంస్థానం మినహా దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ కమ్యూనిస్టు పార్టీలు కంకి,కొడవలి గుర్తుపై పోటీ చేశారు. హైదరాబాద్ సంస్థానంలో కమ్యూనిస్ట్ పార్టీపై నిషేధం ఉండడంతో ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్(పీడీఎఫ్) పేరిట ఎన్నికల్లో పోటీ చేశారు. ఎన్నికల సంఘం పీడీఎఫ్ అభ్యర్థులకు హస్తం గుర్తును కేటాయించింది. అప్పటి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులకు చెయ్యి గుర్తు కేటాయించేది. 1957 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కమ్యూనిస్ట్ పార్టీలకు కంకి కొడవలి గుర్తు లభించింది .తరువాత కాలంలో కమ్యూనిస్టులు సీపీఐ, సీపీఐ(ఎం)గా విడిపోయాయి. ఎన్నికల సంఘం సీపీఐకి కంకి,కొడవలి, సీపీఐ(ఎం)కు సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తులను కేటాయించింది. 1970 లో కాంగ్రెస్ పార్టీ రెండుగా చీలగా ఇందిరాగాంధీకి ఆవుదూడ గుర్తు రాగా , మరోసారి కాంగ్రెస్ పార్టీ రెండుగా చీలిన సమయంలో 1978లో ఇందిరాగాంధీ హస్తం గుర్తు స్వీకరించారు. ఇక అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీది చెయ్యి గుర్తుగా కొనసాగుతోంది.



కళ్లముందే అభివృద్ధి



ధర్మపురిలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలు



ధర్మపురి సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, చిత్రంలో మంత్రి, బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

- ఆగం కావొద్దు.. ఆలోచించి ఓటేయాలి
- కాంగ్రెస్‌కు 11 సార్లు అవకాశమిచ్చినం
- రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్సే..
- కొప్పులను భారీ మెజారిటీతో గెలిపించాలి
- ధర్మపురి ప్రజాఆశీర్వాద ప్రచార సభలో సీఎం కేసీఆర్

ధర్మపురి: 'అభివృద్ధి మీ కళ్లముందే కనిపిస్తోంది. ఓట్లు వచ్చాయంటే రాబందులు వాలుతాయి. ఆగం కావద్దు. ఆలోచించి ఓటు వేయాలి..' అని సీఎం కేసీఆర్ అన్నారు. ధర్మపురిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాదయాత్రలో పాల్గొన్నారు. అధికారంలోకొచ్చాక విద్య, వైద్యం, తాగు, సాగునీరు, కరెంట్, రైతు సమస్యలు లేకుండా చేసుకున్నామని పేర్కొన్నారు.

కొప్పుల గాలి బాగుంది

ఎమ్మెల్యే, చీఫ్‌విప్, మంత్రిగా కొప్పుల ఈశ్వర్ ధర్మపురిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని, ఇక్కడ ఆయన గాలి బాగుందని సీఎం అన్నారు. కొప్పుల ఈశ్వర్‌ను 75వేల మెజారిటీతో గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తారని పేర్కొన్నారు. నృసింహస్వామికి రూ.వంద కోట్లు మంజూరు చేశామని, పనులు కొనసాగుతున్నాయని, అవసరమైతే మరిన్ని నిధులు మంజూరు చేస్తామని వెల్లడించారు.

కాంగ్రెస్ ఏం చేసింది..?

యాభై ఏళ్లపాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏం అభివృద్ధి చేసిందో ప్రజలు గమనించాలని, సాగునీరు లేక భూములు బీళ్లుగా మారాయని సీఎం కేసీఆర్ అన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకొచ్చాక 24గంటల కరెంట్, సాగునీటితో భూమలన్నీ సస్యశ్యామలంగా మారాయని పేర్కొన్నారు.

కేసీఆర్‌తోనే దళితబంధు

దళితబంధు ఇవ్వాలని ఎవరూ కోరకున్నా.. వారి కుటుంబాలు బాగుపడాలనే ఉద్దేశంతో దళితబంధును తెచ్చామని సీఎం కేసీఆర్ అన్నారు. తర్వాత బీసీబంధు, మైనార్టీబంధు ప్రారంభించుకున్నామని తెలిపారు. కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే హుజూరాబాద్ తరహాలోనే ధర్మపురిలో ఒకేసారి అందరికి పథకం అమలు చేస్తామని స్పష్టం చేశారు.

ఈశ్వర్ పనిమంతుడు ఆశీర్వదించండి

గొల్లపల్లి: 'కొప్పుల ఈశ్వర్ పనిమంతుడు.. మెత్తటి మనిషి. నియోజకవర్గంలో టెయిలాండ్ కాలువలు ఉన్నాయి. రోళ్లవాగు ప్రాజెక్టు అని సతాయించి నా వెంటపడి పనులు చేయించుకున్నడు. ఇప్పుడు నియోజకవర్గంలో 1.30లక్షల ఎకరాలు సాగు అవుతోంది. ఆ తేడా.. అభివృద్ధిని గమనించాలి..' అని సీఎం కేసీఆర్ అన్నారు. గతంలో ఇక్కడి ఎమ్మెల్యేలు ఏ పనీ చేయలేదని, ఈశ్వర్ మాత్రం చెక్‌డ్యాంలు, మిషన్ కాకతీయ కింద చెరువులు బాగు చేయించాడని తెలిపారు. ఎన్నికలు రాగానే అందరూ వస్తారని, అభ్యర్థి గుణగణాలు, పార్టీల చరిత్ర, అభివృద్ధిని చూసి ఓటేయాలని సీఎం కోరారు.

ధర్మపురి రూపురేఖలు మారుస్తా: కొప్పుల



తల్లిదండ్రులు జన్మనిస్తే సీఎం కేసీఆర్ తనకు రాజకీయ భవిష్యత్‌ను ప్రసాదించారని, ఇది తనకు పునర్జన్మగా భావిస్తున్నానని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ప్రజాఆశీర్వాద సభలో మాట్లాడుతూ ఇప్పటికే కోట్లాది నిధులతో అభివృద్ధి చేశానని, మరోసారి అవకాశమిస్తే నియోజకవర్గ రూపురేఖలు మారుస్తానని వెల్లడించారు. అడిగిన ప్రతి పనినీ సీఎం కాదనలేదని, అభివృద్ధి సంక్షేమంలో ధర్మపురి ముందుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ వెంకటేశ్‌నేత, ఎమ్మెల్సీ ఎల్.రమణ, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రసాద్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రాంమోహన్, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, జెడ్పీటీసీ బాదినేని రాజమణి, ఎంపీపీ బాదినేని రాజేందర్ పాల్గొన్నారు.

సీఎం సభ సైడ్‌లైట్స్



- ఉదయం 11 గంటల నుంచే బీఆర్ఎస్ నాయకుల, కార్యకర్తలు, ప్రజలు వివిధ వాహనాల్లో ధర్మపురికి చేరుకున్నారు.
- మధ్యాహ్నం 2 గంటల నుంచి ఏపూరి సోమన్న, కళాబృందాలు ఆటపాటలతో అలరించారు.
- సాయంత్రం 4.40 గంటలకు సీఎం కేసీఆర్ హెలీకాప్టర్ ధర్మపురికి చేరుకుంది. 4.42 గంటలకు సీఎం సభాస్థలికి చేరుకున్నారు.
- 4.43 గంటలకు మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.
- 4.44 గంటలకు సీఎం కేసీఆర్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు.
- సుమారు 18 నిమిషాలపాటు సీఎం ప్రసంగించారు.
- 5.02 గంటలకు ప్రసంగాన్ని ముగించి హెలికాప్టర్‌లో బయల్దేరారు.

ఎన్నికల పరిశీలకుల నియామకం

సాక్షి, పెద్దపల్లి: అసెంబ్లీ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలకులను నియమించింది. ఇతర రాష్ట్రాలకు చెందిన ఐఏఎస్‌లకు ఎన్నికల నిర్వహణ, ఐపీఎస్ అధికారులకు శాంతిభద్రతల నిర్వహణ పరిశీలకులుగా బాధ్యతలు అప్పగించింది. శుక్రవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదలతో వీరు రంగంలోకి దిగి తమకు కేటాయించిన నియోజకవర్గాల్లో సంబంధిత అంశాలపై పర్యవేక్షిస్తారు.

వ్యయ పరిశీలకులు:

రామగుండం: రాజేశ్‌సింగ్ రానా, ఐఏఎస్
పెద్దపల్లి, మంథని: సీఎన్ శ్రీధర్, ఐఏఎస్
శాంతిభద్రతల పరిశీలకులు: కె.కిషోర్, ఐపీఎస్.

సునీల్‌కే మంథని బీజేపీ టిక్కెట్



సునీల్‌రెడ్డి

మంథని: మంథని బీజేపీలో ఉత్కంఠ వీడింది. బీఆర్ఎస్ టిక్కెట్ ఆశించి భంగపడ్డ కాటారం పీఏసీఎస్ చైర్మన్ చల్లా నారాయణరెడ్డి అనూహ్యంగా బీజేపీలో చేరడంతో ఆయనకే టిక్కెట్ వస్తుందనే ప్రచారం జరిగింది. ఈ క్రమంలో గురువారం మూడో విడత లిస్టులో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డికి టిక్కెట్ కేటాయించారు. రెండు రోజుల క్రితం సెంటిమెంట్ టెంపుల్ కన్నాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసి ప్రచారం ప్రారంభించిన సునీల్ టిక్కెట్ కేటాయింపుపై జరిగిన చర్చపై కాస్త వెనక్కితగ్గారు. అదిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో శుక్రవారం నుంచి తన ప్రచారం దూకుడు పెంచనున్నారు. కాగా బీజేపీ జిల్లాలోని రామగుండం టిక్కెట్‌ను కందుల సంధ్యారాణికి ఖరారు చేయగా, పెద్దపల్లి మాత్రం పెండింగ్‌లో పెట్టింది.

బయోడేటా

పేరు: చంద్రుపట్ల సునీల్‌రెడ్డి
పుట్టినతేదీ: 26-01-1974
కుటుంబ నేపథ్యం: తండ్రి రాంరెడ్డి (మంథని మాజీ ఎమ్మెల్యే)
తల్లి: వసుమతి, భార్య: వినత,
పిల్లలు: గౌరవ్, అధితి

విద్యాభ్యాసం: పదో తరగతి వరకు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, బీటెక్ ఆర్‌సీఈ భోపాల్, అమెరికాలో ఎంఎస్ చేసి అక్కడే సిస్కో కంపెనీలో 1996 నుంచి 2010 వరకు పనిచేశారు.
రాజకీయ నేపథ్యం: అమెరికాలో ఉన్నత ఉద్యోగం వదిలి తెలంగాణ ఉద్యమ సమయంలో పాల్గొన్నారు. 2014లో టీఆర్ఎస్ టిక్కెట్ రాకపోవడంతో రెబెల్‌గా పోటీ చేశారు. 2018లో సైతం అవకాశం రాలేదు. ఆ తర్వాత బీజేపీలో చేరారు.

ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం చేయాలి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న పుట్ట మధు

మంథని: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 7న మంథనిలో నిర్వహించే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి పిలుపునిచ్చారు. గురువారం సభా స్థలాన్ని, ఏర్పాట్లను పరిశీలించారు. బీసీ బిడ్డగా నియోజకవర్గ ప్రజలకు అందించిన సేవలను గుర్తుచేసేలా సీఎం సభకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని మధు కోరారు. కాంగ్రెస్ అభ్యర్థి కేవలం ఓట్ల కోసం మాత్రమే ప్రజల వద్దకు వస్తారని, ప్రజల శ్రేయస్సు కు ఏనాడు ఆలోచన చేయలేదనే సందేశాన్ని చాటి చెప్పాలని పేర్కొన్నారు.

నామినేషన్‌కు వేళాయె..

- నేటి నుంచి స్వీకరించనున్న అధికారులు
- ఏర్పాట్లు చేసిన రిటర్నింగ్ అధికారులు



రిటర్నింగ్ అధికారి కార్యాలయం, పెద్దపల్లి



రిటర్నింగ్ అధికారి కార్యాలయం, రామగుండం



మంథనిలో రిటర్నింగ్ అధికారి కార్యాలయం

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. దీంతో ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో అధికార యంత్రాంగం పటిష్ట బందోబస్తుతో కూడిన ఏర్పాట్లను పూర్తి చేసింది. శుక్రవారం నుంచి 10వ తేదీ వరకు ఆదివారం మినహా ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. దీంతో రాజకీయ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర, రిజిస్టర్ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి సిద్ధమవుతున్నారు. అసంపూర్తిగా, అక్షర దోషాలు, తప్పులతో, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా నామినేషన్లు వేస్తే తిరస్కరించే అవకాశం ఉంది. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు తొలిరోజు నామినేషన్ వేయడానికి ఆసక్తి చూపడం లేదు. ఈనెల 8, 9వ తేదీల్లో భారీ ర్యాలీలతో నామినేషన్లు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

సర్వం సిద్ధం..

నామినేషన్లు స్వీకరించే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అకౌంటింగ్ టీం, వీవీటీ, సీ విజిల్ హెల్ప్ డెస్క్‌లతో పాటు, నామినేషన్ సమయం రికార్డు చేసేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు ఉన్న సందేహాలను నివృత్తి చేసుకునేందుకు కేంద్రాల్లో సహాయ కేంద్రాలు ఉన్నాయి.

నియోజకవర్గం	రిటర్నింగ్ అధికారి	కార్యాలయం
రామగుండం	అరుణశ్రీ, అదనపు కలెక్టర్	ఎన్టీపీసీ–టీటీఎస్ జెడ్పీ హైస్కూల్
పెద్దపల్లి	మధుమోహన్, ఆర్డీవో	ఆర్డీవో ఆఫీస్
మంథని	వి.హనుమనాయక్, ఆర్డీవో	ఆర్డీవో ఆఫీస్

నామినేషన్ల స్వీకరణకు నిబంధనలు

రాష్ట్రంలో ఎక్కడైనా ఓటు హక్కు కలిగి ఉండి, 25 ఏళ్లు ఉన్న ఎవరైనా నామినేషన్లు వేయవచ్చు. నామినేషన్ వేసే అభ్యర్థిని ప్రతిపాదించే వ్యక్తికి మాత్రం, ఆ నియోజకవర్గంలో ఓటు హక్కు తప్పనిసరిగా కలిగి ఉండాలి. గుర్తింపు పొందిన పార్టీలకు ఒకరు, గుర్తింపు లేని స్వతంత్ర అభ్యర్థులకు పది మంది ప్రతిపాదించాలి. పోటీ చేసే అభ్యర్థి ఓసీ ఐతే రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.5వేలు డి పాజిట్ చెల్లించాలి. ఆర్వో కా ర్యాలయంలో పొందిన నామినేషన్ పత్రాన్ని తీసుకొని ఫారం–2లో సమర్పించాలి. అభ్యర్థి ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా తెరిచి అందులో ఎన్నికల వ్యయాన్ని చూపాలి. ఒక్క అభ్యర్థి నాలుగు నామినేషన్‌లు వేయవచ్చు. నామినేషన్‌తో పాటు రూ.10 నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపరుపై అఫిడవిట్ సమర్పించాలి. అఫిడవిట్‌ను ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ లేదా నోటరీ చేయించాలి.

ఆర్వో నుంచి తీసుకోవాల్సిన పత్రాలు

- ప్రమాణం చేసినట్లు ధ్రువీకరణ పత్రం
- చెల్లించిన డిపాజిట్ మొత్తానికి రసీదు
- ఎన్నికల ఖర్చులను నమోదు చేసే రిజిస్టర్లు
- స్క్రూటినీకి హాజరయ్యేందుకు నోటీసు
- నామినేషన్‌లో లోపాలు, జతపర్చాల్సిన పత్రాల పత్రం
- ఎన్నికల వ్యయానికి సంబంధించిన ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 127–ఏ కు సంబంధించిన సూచనల పుస్తకం .

కార్యాలయం వద్ద 144 సెక్షన్



జ్యోతినగర్(రామగుండం): నామినేషన్ల ప్రక్రియ ఏర్పాట్లు వేగవంతం చేశాం. కార్యాలయం వద్ద 100 మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ విధించాం. అభ్యర్థితోపాటు ఐదుగురికి మాత్రమే కార్యాలయంలోకి అనుమతి ఉంది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరణ కొనసాగుతుంది.
– జె.అరుణశ్రీ, రిటర్నింగ్ అధికారి, రామగుండం

నిబంధనలు పాటించాలి



మంథని: నామినేషన్లు స్వీకరణకు మంథనిలో ఏర్పాట్లు చేశాం. ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి అభ్యర్థులు నడుచుకోవాలి. ఏసీపీ స్థాయి అధికారి పర్యవేక్షణలో బందోబస్తు, సీసీ కెమెరాల నిఘాలో రిటర్నింగ్ అధి కారి కార్యాలయం ఉంటుంది.
– హనుమనాయక్, రిటర్నింగ్ అధికారి, మంథని

అన్ని ఏర్పాట్లు చేశాం



పెద్దపల్లిరూరల్: అభ్యర్థులు నిబంధనలు పాటించాలి. శుక్రవారం నుంచి ఈనెల 10 వరకు నామినేషన్లను దాఖలు చేసుకోవచ్చు. 15న సాయంత్రం స్వతంత్ర, గుర్తింపులేని పార్టీ అభ్యర్థులకు గుర్తులు కేటాయించి జాబితా ప్రకటిస్తాం. అభ్యర్థులు ఎన్నికల ఖర్చుల కోసం ప్రత్యేక బ్యాంకు ఖాతా నిర్వహించాలి.
– మధుమోహన్, రిటర్నింగ్ అధికారి, పెద్దపల్లి

క్లుప్తంగా

అట్రాసిటీ కేసు నమోదుపై విచారణ



విచారణ చేస్తున్న ఏసీపీ తుల శ్రీనివాస్

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన బుర్ర ముత్యాలగౌడ్ అనే వ్యక్తిపై గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు కాగా.. గురువారం గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాస్ విచారణ చేశారు. గత నెల 20న వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన కండె లక్ష్మయ్య అనే కాంట్రాక్ట్ కార్మికుడు అదే గ్రామానికి చెందిన బుర్ర ముత్యాలగౌడ్ కులం పేరుతో దూషించారని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఏసీపీ శ్రీనివాస్, టూటౌన్ సీఐ వేణుగోపాల్ సాక్షులతో మాట్లాడారు. పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంచిరామి యువకుడికి పీహెచ్‌డీ పట్టా



పట్టా అందుకుంటున్న రమేశ్

సుల్తానాబాద్‌రూరల్: మంచిరామి యువకుడు గూడెపు రమేశ్ ఉస్మానియా విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో బుధవారం వైస్ ఛాన్సిలర్ ప్రొఫెసర్ రవీందర్, ముఖ్య అతిథి అడోబ్ సిస్టమ్స్ అమెరికా సీఈవో శంతను నారాయణ్ చేతుల మీదుగా ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ జియోఫిజిక్స్ విభాగంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నాడు. ప్రస్తుతం పుణెలో భూగర్భ శాఖ జియో సైంటిస్ట్‌గా ఉద్యోగం చేయడంతో పాటు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉదయలక్ష్మీ పర్యవేక్షణలో గ్రౌండ్ వాటర్ మేనేజ్‌మెంట్ ఫర్ అక్విఫర్ మాపింగ్ యూసింగ్ రిమోట్, ఎలక్ట్రికల్ స్టడీస్ ఇన్ ది సినా వాటర్ షెడ్ ఏరియా, అహ్మద్‌నగర్ జిల్లా మహారాష్ట్ర స్టేట్ ఇండియా అనే భూగర్భ జలాల అంశాలపై రీసెర్చ్ చేసినందుకు పట్టా పొందాడు.

ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరిస్తాం

సుల్తానాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం అధికారి ఆంజనేయులు ప్రచారాలను పరిశీలించారు. గురువారం మండల కేంద్రంలో అధికార పార్టీతో పాటు పలు పార్టీల ప్రచారాలు, వాటి తీరును పరిశీలించారు. ఎలక్షన్ కోడ్ ఉల్లంఘనపై వెంటనే ఫిర్యాదులు చేస్తే గంటన్నర వ్యవధిలో సమస్యను పరిష్కరించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రీవెన్స్ సెల్‌కు రాజకీయ పార్టీల నుంచి అందిన ఫిర్యాదులను పరిష్కరిస్తామని చెప్పారు. ఆయన వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.

మద్యం అక్రమ నిల్వలపై సమాచారమివ్వండి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో మద్యం అక్రమంగా నిల్వ చేసినా, గుడుంబా తయారీ చేస్తున్నట్లు గుర్తిస్తే టోల్ ఫ్రీ నంబరు 1800 425 2523 సమాచారమివ్వాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటివరకు జిల్లాలో 436 కేసులు నమోదు చేసి 137మందిని అరెస్ట్ చేశామని వివరించారు. వారి నుంచి 1,167 లీటర్ల గుడుంబా, 1,855 కిలోల బెల్లం, 1,352 లీటర్ల మద్యం, 6 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నాణ్యమైన విద్య అందించాలి

• కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఎలిగేడు(పెద్దపల్లి): విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. మండలంలోని సుల్తాన్‌పూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కిచెన్‌గార్డెన్‌ను గురువారం అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గొప్ప స్థానాల్లో ఉన్న శాస్త్రవేత్తలు, వ్యాపారవేత్తలు, అత్యుత్తమ పదవుల్లో ఉన్న అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఎదిగానవారేనని పేర్కొన్నారు. విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాలు సాధించాలంటే ఆరోగ్యంగా ఉండాలని, చిన్నతనం నుంచే మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకుని, రోజూ కొంత సమయం వ్యాయమం, ఏవైనా క్రీడలు ఆడటానికి కేటాయించాలని సూచించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కిచెన్‌గార్డెన్ ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలుస్తుందని, కెచిన్‌గార్డెన్ కోసం హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు చేసిన కృషిని అభినందిచారు. కిచెన్‌గార్డెన్ నిర్వహణ సిబ్బందిని సత్కరించారు. మాపురం ఇంద్రసేనారెడ్డి విద్యార్థుల స్పోర్ట్స్ డ్రెస్‌ల కోసం రూ.30వేలు డొనేట్ చేయగా, ఆ డ్రెస్‌లను కలెక్టర్, డీఈవో చేతమీదుగా విద్యార్థులకు అందజేశారు. అనంతరం గ్రామంలోని పల్లె దవాఖానాను కలెక్టర్ తనిఖీ చే శారు. ప్రజలకు అవసరమైన వైద్యసేవలు సత్వరం అందించాలని సూచించారు. తర్వాత గ్రామపంచాయతీ భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ శ్రీధర్, డీఈవో మాధవి, అకడామిక్ కోఆర్డినేటర్ పీఎం షేక్, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఎంఈవో కవిత, హెచ్‌ఎంలు నరేంద్రచారి, సంతోష్‌రెడ్డి, పూర్వ హెచ్‌ఎం సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.



కిచెన్ గార్డెన్ పరిరక్షించిన వారిని సన్మానిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అధికారులు

ఓటు నమోదు శాతం పెంచాలి

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం నియోజకవర్గంలో ఓటరు నమోదు శాతం పెంచడానికి జిల్లా అదనపు కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ ఆదేశాల మేరకు స్వీప్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఓటరు అవగాహన చైతన్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గురువారం యైటింక్లయిన్‌కాలనీ, వారసంత, కాలనీ సంతోష్‌నగర్ ఏరియాలోని కస్తూర్బా పాఠశాల ఆవరణ, న్యూమారేడుపాక, అల్లూరు ఏరియాల్లో ఓటరు నమోదు కార్యక్రమాలను నిర్వహించారు. స్వీప్ నోడల్ అధికారి స్వరూపరాణి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని నియోజకవర్గంలో ఓటు నమోదు శాతాన్ని పెంచాలని కోరారు. చైతన్య రథం కళాజాత బృందం కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మెప్మా సీవో స్వప్న, ఆర్పీ, మున్సిపల్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

బీఎస్పీలో చేరికలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి అసెంబ్లీ రాజకీయాల్లో పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయి. అనూహ్యంగా బీఆర్‌ఎస్ జెడ్పీటీసీ బండారు రామ్మూర్తి, మున్సిపల్ కౌన్సిలర్ పోతని పురుషోత్తంతో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, డీసీసీ మాజీ అధ్యక్షుడు ఈర్ల కొమురయ్య ఆయా పార్టీలను వీడి గురువారం హైదరాబాద్‌లో బీఎస్పీలో చేరారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కండువాలు కప్పి ఆహ్వానించారు. బీజేపీ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు, 16వ వార్డు కౌన్సిలర్ రాజం మహంత కృష్ణ సైతం బీఎస్పీలో చేరారు. నియోజకవర్గ పరిధిలోని పలు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు బీఎస్పీ కండువా కప్పుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి హనుమయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష, అసెంబ్లీ కోకన్వీనర్ అఖిల, నాయకులు చంద్రశేఖర్, నవీన్, రవి తదితరులు పాల్గొన్నారు.



ప్రవీణ్‌కుమార్‌తో జెడ్పీటీసీ రామ్మూర్తి, కౌన్సిలర్ పురుషోత్తం, ఈర్ల కొమురయ్య తదితరులు

మంథనిలో సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్

మంథని: మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాల్లో పోలింగ్‌ను ఒక గంట కుదిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. దీంతో నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలో సాయంత్రం 4 వరకే పోలింగ్ ప్రక్రియ ముగియనుంది. తెలంగాణలోని 13 నియోజకవర్గాల్లో మావోయిస్టుల ప్రభావం ఉంది. ఇవి గోదావరి నదీతీరం వెంట ఉన్నాయి. ఈ నియోజకవర్గాల్లో నవంబర్ 30న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మిగతా నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారని అధికారులు వివరించారు.

రూ.29.47 లక్షల మద్యం స్వాధీనం



మద్యాన్ని చూపిస్తున్న అధికారులు

గోదావరిఖని: అక్రమ మద్యం రవాణాపై కొరడా ఝుళిపించినట్లు రామగుండం ఎక్సైజ్ సీఐ సుంకరి రమేశ్ తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నాటి నుంచి నేటి వరకు 59 గుడంబా కేసులు, ఒక గంజాయి కేసు, 34 అక్రమ మద్యం కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. 59 మంది నిందితులు, మరికొంతమంది అనుమానితులను తహసీల్దార్ల వద్ద బైండోవర్ చేసినట్లు వివరించారు. 328 లీటర్ల గుడుంబా సీజ్ చేసి 8,050 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. మహారాష్ట్రలోని వీరూర్ నుంచి వివిధ రైళ్లలో అక్రమంగా తరలిస్తున్న రెండు కిలోల గంజాయి, 780 కిలోల బెల్లం, 219 కిలోల పటిక సీజ్ చేసి కేసులు నమోదు చేశామన్నారు. బెల్ట్‌షాపులపై 34 కేసులు నమోదు చేసి అక్రమ మద్యం వ్యాపారులను తహసీల్దార్ల వద్ద బైండోవర్ చేశామన్నారు. వారి వద్ద నుంచి 11 ఫుల్ బాటిళ్లు, 9 ఆఫ్ బాటిళ్లు, 743 క్వార్టర్ బాటిళ్లు, 286 90ఎంఎల్ బాటిళ్లు, 307 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.29.47 లక్షలుంటుందని వెల్లడించారు.

మొన్న బీఆర్‌ఎస్‌లోకి.. నిన్న కాంగ్రెస్‌లోకి..





మూడు రోజుల క్రితం పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే చందర్, పార్టీలోకి ఆహ్వానించిన ఠాకూర్

రామగుండం: అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ల ఫోరం అధ్యక్షుడు అల్లనేరడి కనకయ్య సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నాడు. తనకు కాంగ్రెస్‌లో గుర్తింపు లేదంటూ కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్‌సింగ్ ఠాకూర్‌పై అలకబూని ఆదివారం స్థానిక నేతలతో బీఆర్‌ఎస్‌లో చేరగా.. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. స్పందించిన మక్కాన్‌సింగ్‌ఠాకూర్ కనకయ్యను బుజ్జగించి పార్టీ ప్రతినిధుల సమక్షంలో కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్, ఎనగందుల శ్రీకాంత్, చల్లా రవీందర్‌రెడ్డి, గట్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సర్కారుకు అంతిమ ఘడియలు

• ఏఐసీసీ పరిశీలకుడు సుదీప్ చాకోటే

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న బీఆర్‌ఎస్ సర్కారుకు అంతిమ ఘడియలు సమీపించాయని ఏఐసీసీ పరిశీలకుడు సుదీప్ చాకోటే అన్నారు. పెద్దపల్లిలో గురువారం ముఖ్య నాయకులు, బూత్, గ్రామ, సోషల్ మీడియా కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు విజయరమణారావు, బిరుదు రాజమల్లుతో కలిసి పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రజాధనాన్ని లూటీ చేసిందన్నారు. ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుదీప్ చాకోటే

కాంగ్రెస్‌లో చేరిన ఐలయ్య

పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుడు గుండేటి ఐలయ్యయాదవ్ తదితరులు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. సుదీప్ చాకోటే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పేషెంట్ కేర్ ఎక్కడ..?



పేషెంట్‌ను వీల్ చైర్‌లో తీసుకెళ్తున్న కుటుంబ సభ్యుడు

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో పేషెంట్ కేర్ సేవలు కానరావడం లేదు. ఆస్పత్రి ముందు ఒక్క పేషెంట్ కేర్ కూడా కనిపించకపోవడంతో.. పేషెంట్లు, వారి బంధువులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడవలేని స్థితిలో ఉన్న పేషెంట్లను వీల్ చైర్, స్ట్రెక్చర్‌లో ఎమర్జెన్సీ వార్డుకు తరలించడానికి ఒక్క పేషెంట్ కేర్ కూడా ముందుకు రావడం లేదు. గత్యంతరం లేక పేషెంట్లను వారి బంధువులే వీల్ చైర్‌లో వైద్యం కోసం ఆస్పత్రి వార్డులకు తరలిస్తున్నారు. దీనిపై ఆస్పత్రి ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పేషెంట్లు, వారి బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి



రవి, కుమార్ సింగ్(ఫైల్)

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం బొంపల్లి గ్రామ శివారులోని స్టోన్ క్రషర్ వద్ద పని కోసం లారీపై తరలిస్తున్న ఎక్సవేటర్ యంత్రం వేలాడుతున్న కరెంటు తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై భూక్య రవి(40) అక్కడికక్కడే మరణించాడు. తీవ్రంగా గాయపడ్డ లారీ డ్రైవర్ దీప్‌నారాయణ్ కుమార్‌సింగ్(38) చికిత్స పొందుతూ కరీంనగర్‌లో మరణించాడు. క్లీనర్ ఉదయ్ చౌదరి గాయపడి చికిత్స పొందుతున్నారు. బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలను బసంత్‌నగర్ ఎస్సై వెంకటేశ్ వెల్లడించారు. హుస్నాబాద్ నుంచి పెద్దపల్లి మండలం బొంపల్లి శివారులోని క్రషర్‌లో పని చేసేందుకు వస్తుండగా జరిగిన ప్రమాదంలో నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం దంజాతండాకు చెందిన భూక్య రవి అక్కడికక్కడే మరణించాడని తెలిపారు. మృతుడికి భార్య కవిత, ఇద్దరు పిల్లలున్నారు. లారీ డ్రైవర్‌గా పని చేస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన దీప్‌నారాయణ్ కుమార్‌సింగ్, క్లీనర్ ఉదయ్ చౌదరి గాయపడ్డారు. వారిని పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చేయించి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దీప్‌నారాయణ్ కుమార్‌సింగ్ మరణించాడు. ఉదయ్ చౌదరి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని ఎస్సై తెలిపారు. మృతుడు రవి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బొంపల్లి గ్రామ శివారులో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని, వాటిని సరి చేయాలంటూ విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం వల్లే రెండు నిండు ప్రాణాలు బలయ్యాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. హుస్నాబాద్ నుంచి ఎక్సవేటర్‌తో లారీపై బయల్దేరిన వారు మరో పది నిమిషాలైతే పని చేయాల్సిన స్టోన్ క్రషర్ వద్దకు చేరుకునేవారని స్థానికులు పేర్కొంటున్నారు.

'ఖని' విద్యార్థినికి గోల్డ్ మెడల్స్



స్నేహితారెడ్డి

గోదావరిఖనిటౌన్(రామగుండం): గోదావరిఖనికి చెందిన విద్యార్థిని బంగారు పతకాలు సాధించింది. స్థానిక పవర్‌హౌస్‌కాలనీకి చెందిన సింగరేణి ఉద్యోగి (ఆర్జీ-1, వీటీసీ ఓవర్‌మెన్) సదాశివరెడ్డి కుమార్తె స్నేహితారెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ ఎమ్మెస్సీ ఇనార్గానిక్ కెమిస్ట్రీలో ప్రతిభ కనబర్చింది. మూడు బంగారు పతకాలతో యూనివర్సిటీ ప్రథమ స్థానంలో నిలిచింది.

బొగ్గుబాయి వార్తలు

ఆర్జీ-2 జీఎంకు వినతి

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ-2 ఏరియాలోని కార్మిక వాడల్లో కొన్ని నెలల నుంచి కుక్కలు, కోతులు, పందులతో కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని, వాటిని తరలించాలని కోరుతూ ఆర్జీ-2 జీఎంకు ఆర్జీ-3 ఏరియా హెచ్‌ఎంఎస్ బ్యాంచ్ సెక్రటరీ ముహమ్మద్ ఇస్మాయిల్ గురువారం వినతి పత్రం అందజేశారు. భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని, చర్యలు తీసుకోవాలని కోరారు.

సింగరేణి సంస్థను కాపాడుకుందాం

• రామగుండం కాంగ్రెస్ అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాకూర్



మాట్లాడుతున్న రాజ్‌ఠాకూర్

గోదావరిఖని(రామగుండం): కాంగ్రెస్ పార్టీని గెలపించి సింగరేణి సంస్థను కాపాడుకుందామని డీసీసీ అధ్యక్షుడు, రామగుండం కాంగ్రెస్ అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. గురువారం టీబీజీకేఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ, జీడీకే-5 ఓసీపీ ఏర్పాటుతో ఈప్రాంతాన్ని బొందలగడ్డగా మార్చారని, స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేశారన్నారు. ఓసీపీ నుంచి వెలువడే విషవాయువు, దుమ్ముతో జనం గుండెపోట్లు వచ్చి పిట్టల్లా రాలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కార్మికుల సొంతింటి కల నిజం చేస్తామని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తామన్నారు. సింగరేణిని ప్రైవేట్‌పరం కానివ్వమని పేర్కొన్నారు. ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాగా నాయకులు పెంచాల తిరుపతి, జనగామ శ్రీనివాస్‌గౌడ్, సాయికుమార్ ఆధ్వర్యంలో జీడీకే-2, జీడీకే-11 గని కార్మికులు, టీబీజీకేఎస్ నాయకులు పార్టీలో చేరారు. అలాగే బ్రాహ్మణపల్లి మాజీ సర్పంచ్ నేరెళ్ల కనకయ్య కాంగ్రెస్‌లో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు.

తపన.. తప్పు చేయలే..

• బీఆర్‌ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు



కండువా వేస్తున్న పుట్ట మధు

మంథని: అనేక సంవత్సరాలు ఒకే కుటుంబం చేతిలో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు విముక్తి కల్పించాలనే తపన పడుతున్నానే తప్పా తాను ఎలాంటి తప్పులు చేయలేదని, వివిధ పదవుల్లో ఉన్నా కొన్ని పనులు కాకపోతే తమను తప్పు పట్టొద్దని బీఆర్‌ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి, జిల్లాపరిషత్ చైర్మన్ పుట్ట మధు కోరారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మంథని మున్సిపల్ పరిధిలోని ఎరుకలగూడెం, చైతన్యపురికాలనీ, పద్మశాలి వీధి, కూచిరాజ్‌పల్లి, గంగాపురి, లైన్‌గడ్డ, మార్కెట్, అంబేద్కర్ చౌక్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కార్నర్ సమావేశాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ శైలజతో కలిసి మాట్లాడారు. మంథని నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో పెద్ద సంఖ్యలో చేరారు. మహాముత్తారం మండలం యామన్‌పల్లి నుంచి 15 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. మంథనికి చెందిన న్యాయవాది పులి అశోక్ దంపతులు, పవర్‌హౌస్‌కాలనీకి చెందిన ఆకుల వేణు పార్టీ తీర్థం పుచ్చుకోగా.. పుట్ట మధు వారికి కండువా కప్పి ఆహ్వానించారు. మంథని మండలం మల్లేపల్లి, సిరిపురం నుంచి పార్టీలో చేరారు. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు సొంత గ్రామం కాటారం మండలం దన్వాడ సర్పంచ్ జంగిలి నరేష్ బీఆర్‌ఎస్‌లో చేరారు. మంథనిలో ఆయనకు పుట్ట మధు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఐదు గంటల వ్యవధిలోనే రాత్రి 11 గంటల సమయంలో కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు నివాసంలో కాంగ్రెస్ కండువాతో శ్రీధర్‌బాబుతో కనిపించారు.

అభివృద్ధి వైపా.. టైంపాస్ వైపా..

• పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్



మాట్లాడుతున్న కోలేటి దామోదర్

గోదావరిఖని(రామగుండం): అభివృద్ధి వైపా, టైంపాస్ వైపా ప్రజలు ఆలోచించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రధాన చౌరస్తాలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో కలిసి మాట్లాడారు. ఇండిపెండెంట్‌గా గెలిచిన చరిత్ర ఉన్న చందర్‌కు ప్రస్తుతం పార్టీ తోడుందని, 50వేల మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. రెండేళ్ల కాలం కరోనాతో పోను, రెండున్నరేళ్లలోనే మెడికల్ కళాశాల, ఐటీ పార్క్, ఇండస్ట్రియల్ పార్క్, కుర్జ్ కమ్మీ భూములకు పట్టాలవంటి అసాధ్యం అనుకున్న పనులను చేసి చూపించారన్నారు. రాష్ట్రంలో ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చే 5 గంటల కరెంటు కావాలా, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చే 24 గంటల కరెంటు కావాలా ప్రజలు, రైతులు తేల్చుకోవాలన్నారు. సమావేశంలో మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, రాష్ట్ర నాయకులు మూల విజయరెడ్డి, నడిపెల్లి మురళీధర్‌రావు, అడ్డాల రామస్వామి, తానిపర్తి గోపాలరావు, మాదాసు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కోరుకంటి, కోలేటి సమాలోచనలు

ఎన్నికలకు మరో 28 రోజులే ఉన్నాయి. పార్టీ గెలుపుకోసం ఎలా ముందుకెళ్లాలి? ప్రణాళికలు ఏవిధంగా ఉండాలని ఎమ్మెల్యే చందర్, పోలీస్‌హౌజింగ్ బోర్డు చైర్మన్ దామోదర్ ఇరువురు సమాలోచనలు జరిపారు. బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఇరువురు ఏకాంతంగా చర్చించడం పలువురు ఆసక్తిగా గమనించారు.

గెలిచిన ఆరు నెలల్లో స్మార్ట్ సిటీగా మారుస్తా

• బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి



బాండ్ పేపర్ చూపుతున్న కందుల సంధ్యారాణి

గోదావరిఖని(రామగుండం): తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఆరునెలల్లోగా రామగుండాన్ని స్మార్ట్‌సిటీగా మారుస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల సంధ్యారాణి పేర్కొన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఈమేరకు ప్రజలకు రాసిచ్చిన అగ్రిమెంట్ బాండ్‌పేపర్‌ను పాత్రికేయులకు చూపించారు. ఆరునెలల్లోగా స్మార్ట్‌సిటీ చేయకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని పేర్కొన్నారు. 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏలాంటి అవినీతి లేకుండా పనిచేశానని, తనకు అవకాశం కల్పిస్తే నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో కొంతమంది నా యకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ ప్ర జలను అయోమయానికి గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు ధర్మపురి, విజయ్, రేణుక, కుమార్, సారంగపాణి, గుండ్రాతి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే..

కార్మికులను గనులపై కలవకుండా అధికార పార్టీ నాయకులు నిర్బంధం విధిస్తున్నారని బీజేపీ అభ్యర్థి సంధ్యారాణి పేర్కొన్నారు. గురువారం జీడీకే-11గనిపై ప్రచారం నిర్వహించారు. ఓటమి భయంతోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈవిధంగా చేస్తుందని విమర్శించారు. తొలిసారిగా మహిళా అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఎమ్మెల్యేగా గెలిపించి చట్టసభల్లో మాట్లాడే అవకాశం కల్పించాలన్నారు. బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పాల్గొన్నారు.

మంథనిలో చరిత్ర తిరగరాస్తాం

• బీజేపీ మంథని అభ్యర్థి చంద్రుపట్ల సునీల్‌రెడ్డి



మాట్లాడుతున్న చంద్రుపట్ల సునీల్‌రెడ్డి

మంథని: మంథని నియోజకవర్గంలో ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని, 1994 నాటి చరిత్రను మరోమారు తిరగరాస్తామని మంథని ఎమ్మెల్యే అభ్యర్థి చంద్రుపట్ల సునీల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం బీజేపీ మూడో విడత టికెట్ల కేటాయింపులో మంథని అభ్యర్థిగా సునీల్‌రెడ్డి పేరు ఖారారు కావడంతో ఆయన విలేకరులతో మాట్లాడారు. తన పేరు బ్యాలెట్‌లో లేకుండా చేయాలని కొంతమంది ప్రయత్నాలు చేశారని, బీజేపీ నాయకత్వం, కార్యకర్తల కృషి ఫలితంగా తనకు అవకాశం దక్కిందన్నారు. కార్యకర్తలు, నాయకులు ఎన్నికల వరకు కష్టపడి మంథనిలో బీజేపీ జెండా ఎగరేద్దామన్నారు. మంథని మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ మల్కా మోహన్, కో-కన్వీనర్ నాంపల్లి రమేశ్, నాయకులు కొండపాక సత్యప్రకాష్, పోతరవేణి క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేరిక..

మంథనిలోని బీజేపీ కార్యాలయంలో ముత్తారం మండలం శాత్రాజ్‌పల్లి, మంథని మండలం ఆరెంద గ్రామానికి చెందిన వంద మంది మహిళలు, యువకులు బీజేపీలో చేరారు. వారికి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సునీల్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
Finance Services
■ సిరి అసోసియేట్స్ అన్ని రకాల రుణాలు, పర్సనల్ హౌసింగ్ మార్ట్ గేజ్ ఓపెన్ ప్లాట్స్ పై కూడా సివిల్ ప్రాబ్లం ఉన్న చేయించబడును. సంప్ర: సెల్: 9666142226 [W-1220931]

BUSINESS OFFER
■ ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయం, పర్యావరణానికి అనుకూలం. 100% ఆర్గానిక్ విలువలతో తయారవుతున్న బయోడిగ్రేడబుల్ కవర్లను మార్కెటింగ్ చేయుటకు డిస్ట్రిబ్యూటర్స్ డీలర్లు మరియు మార్కెటింగ్ సిబ్బంది కావలెను. సంప్రదించండి: 9848211153, 9490786468 [H-788343]

WANTED
■ మా ఆఫీసు న్యూ బ్రాంచ్ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్‌టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [M-1221903]

■ రామకృష్ణ గ్రూప్, (TS No.1) VJA, HYD శ్రీమంతులఇళ్ళలో వృద్ధుల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు వర్కర్స్ కావలెను / 24x7 పంపగలము. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 96038 92233, 62812 08600 [B-1206460]

■ ప్రముఖ బ్యాంకు DSAల యందు కాంట్రాక్టు పద్ధతిలో వర్క్ చేయడానికి M/F స్టాఫ్ అ.కా.ను. అ: ఇంటర్, డిగ్రీ జీ: 17K to 35K ఇంట్రెస్ట్ ఉన్న వారు వెంటనే డీటేల్స్ వాట్సాప్ చేయండి. 9885426966 [H-193239]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీతం: 18K Ph: 9848571888/9640400073 [H-189348]

www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824